సచివాలయాలు.. సేవాలయాలు

ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే సాధారణ పౌరులు ఎన్నో కష్టాలు పడేవారు. కొన్ని సేవలు పొందాలంటే మధ్యవర్తులను ఆశ్రయించి కొంత మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. సచివాలయ వ్యవస్థ రాకతో అటాంటి ఇబ్బందులు చెక్ పడింది. సచివాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.


పుత్తూరు ఆర్టీసీ కాలనీ సచివాలయం


సచివాలయ విధి నిర్వహణలో కార్యదర్శులు

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ సేవలు
- ప్రతి రోజూ స్పందన
- సమస్యలకు సత్వర పరిష్కారం
- గ్రామాల్లోనే అందుతున్న 540 సేవలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల ఆనందం

పుత్తూరు రూరల్: మహాత్ముడు కన్న కలలకు ప్రతి రూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. 2 వేల జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పుత్తూరు మండలంలో మొత్తం 23 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో 13 మంది కార్యదర్శులు, 540 సేవలను నిర్దిష్ట కాల వ్యవధిలో అందిస్తున్నారు. పట్టణ పరిధిలోని ప్రతి వార్డు సచివాలయంలో 10 మంది సెక్రటరీలు సేవలందిస్తున్నారు. అడ్మిన్ సెక్రటరీతో పాటు అమునిటీ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, రెవెన్యూ, పోలీస్ ప్రొటెక్షన్, హెల్త్, ఎలక్ట్రిసిటీ సెక్రటరీలు సేవలందిస్తున్నారు. అదే రూరల్ పరిధిలో ఈ పది మందితో పాటు అగ్రికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ సెక్రటరీలు సైతం అందుబాటులో ఉంటారు. జిల్లా కేంద్రాల్లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటే, సచివాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవినీతికి తావులేకుండా పారదర్శంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేస్తున్నాయి.

తిరిగే పని తప్పింది



పదేళ్లుగా ఇంటి పట్టా కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయాను. సచివాలయంలో అర్జీ ఇస్తే పని అవుతుందని సన్నిహితులు తెలిపారు. దాసరి గుంట సచివాలయంలో అర్జీ ఇచ్చాను. 90 రోజుల్లో ఇంటి పట్టా ఇచ్చారు. ఇప్పుడు జగనన్న ఇల్లు కట్టుకోవడానికి మళ్లీ అర్జీ ఇచ్చాను. త్వరలోనే ఇల్లు మంజూరు చేయిస్తామని చెపారు. సచివాలయంలో ఇంత సులభంగా పనులు అవుతాయని అనుకోలేదు.

–టి.జ్యోతి, సత్యనారాయణకాలనీ, గేటు పుత్తూరు

గంటలో బియ్యం కార్డు



హోటల్‌లో పనిచేస్తూ జీవితాన్ని గడుపుతున్నాను. గత ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమాల్లో మూడు సార్లు రేషన్ కార్డు కావాలని అర్జీలు పెట్టుకున్నాను. ఫలితం లేకపోయింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన సచివాలయంలో మా వీధిలోని వలంటీర్ ద్వారా అర్జీ ఇచ్చాను. నన్ను కూర్చొబెట్టి గంటలో తహసీల్దార్ చేతుల మీదుగా నాకు బియ్యం కార్డు ఇచ్చారు. ఈ ప్రభుత్వం మేలు మరచిపోలేను.

–ఎ.చంద్రన్, రెడ్డిగుంట, పుత్తూరు

మాడ్రన్ సచివాలయాలే లక్ష్యం



జిల్లాలోని ప్రతి సచివాలయాన్ని మాడ్రన్ సచివాలయంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రయోగాత్మకంగా కొన్ని సచివాలయాలను ఎంపిక చేసి అమలు చేస్తున్నాం. సచివాలయానికి వచ్చే ప్రతి వ్యక్తి సమస్యను పరిష్కరించే దిశగా కార్యదర్శులు పనిచేయాలి. తద్వారా మంచి ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడానికి సమష్టిగా కృషి చేస్తున్నాం.

–ఎస్. ఇర్షద్‌అలి, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్, చిత్తూరు జిల్లా

ఆరోగ్యశ్రీ కార్డు అందించి ఆదుకున్నారు



నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను. ఎంతో కాలంగా ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఎదురుచూశాను. అంబేద్కర్ సచివాలయంలో అర్జీ ఇచ్చాను. షణ్ముగం అనే కార్యదర్శి నాకు పూర్తిగా సహకరించి నాకు ఆరోగ్యశ్రీ కార్డును అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా వైద్య సేవలను పొందగలుగుతున్నాను. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

–కె.దీపక్‌కుమార్, అంబేద్కర్ సర్కిల్, పుత్తూరు

పెన్షన్ మంజూరైంది



నేను ఒంటరి మహిళను. పెన్షన్ కోసం రాచపాళెం సచివాలయంలో అర్జీ ఇచ్చాను. ఇక్కడి సిబ్బంది పెన్షన్ మంజూరు చేయించారు. ఇంత ఈజీగా పని అవుతుందని ఊహించనే లేదు. కానీ ఇది వాస్తవం. ప్రతి నెలా ఒకటో తేదీకే పెన్షన్ అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ఎప్పటికి రుణపడి ఉంటాను.

–ఎ.మాధవి, రాచపాళెం, పుత్తూరు

క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న సీఐ

పుత్తూరు రూరల్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కె.లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జైభీమ్ ఆటో యువజన సంఘం సభ్యులకు సీఐ యూనిఫాంలను అందజేశారు. ఆటో డ్రైవర్లు ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌తో వెళ్లకూడదన్నారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.వెంకటేష్, ఉపాధ్యక్షుడు పి.రంజిత్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, రాజేష్, భాస్కర్, బాబు, అజిత్‌కుమార్, అశోక్‌కుమార్, మణికంఠన్, మురగేష్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ మహిళా పోలీస్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

నింద్ర: ప్రతి గడపకూ మహిళా పోలీస్ కార్యక్రమాన్ని నింద్రలో నగరి రూరల్ సీఐ రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రతి గడపకూ మహిళా పోలీస్ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఆర్థిక నేరాలు, మోసాలు, గంజాయి, వేధింపులను వెలుగులోకి తీసుకొచ్చి చర్యలు తీసుకోవడమే కార్యక్రమం ఉద్దేశమయ్యారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవి శంకర్, ఏపీఎం చంద్రకళ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హోరుగాలి.. వర్షం


బేరివీధిలో విరిగిపడ్డ చెట్టు

నగరి: మున్సిపల్ పరిధిలో శుక్రవారం సాయంత్రం హోరుగాలితో వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దీంతో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయి సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విరిగిన చెట్లను తొలగించి పరిస్థితి యాథాస్థితికి తేవడానికి విద్యుత్ శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రమపడాల్సి వచ్చింది.

వృద్ధుడి ఆత్మహత్య

తిరుచానూరు(చంద్రగిరి): గుర్తుతెలియని వృద్ధుడు చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని దామినేడు సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు తను వేసుకున్న తెల్లపంచెతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదు. తెలుపు, సిమెంటు రంగ చొక్కా, సిమెంటు రంగు నిక్కరు వేసుకుని ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు పోలీసులను సంప్రదించవచ్చు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం


స్టేషన్ ప్రాంగణంలో స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం..శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. పూడి క్రాస్ వద్ద రికార్డులు లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు మునిరెడ్డి, మాధవయ్య, చెంచయ్యపై కేసు నమోదు చేశారు.

ముక్కంటి పాలకమండలి సమావేశం వాయిదా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సమావేశం వాయిదా వేసినట్లు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరగాల్సిన పాలక మండలి సమావేశం ఈఓ సాగర్‌బాబు స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

శ్రీరంగరాజపురం: గర్భిణులు పౌష్టకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మండల వైద్యాధికారి పల్లవి అన్నారు. శుక్రవారం వెంకటాపురం సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు తమ ఆహారంలో పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. దీని వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్ రాజు, వైద్య సిబ్బంది గంగాదేవి, కవిత, చంద్రకళ, డేవిడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నగరి: విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా నగరి, నెత్తం కండ్రిగ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని నెలవాయి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న క్షీరసముద్రం, శ్రీరంగరాజపురం, జీఎంఆర్‌పురం, ముద్దుకుప్పం, చోక్కమడుగు, పాతపాల్యం గ్రామల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ గిరి తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా అంతరాయం ఉంటుందని చెప్పారు. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజాసేవ ఇప్పుడు గుర్తుకొచ్చిందా...?


సమావేశంలో మాట్లాడుతున్న మణి

శ్రీరంగరాజపురం: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ థామస్‌కు ప్రజాసేవ ఇప్పుడు గుర్తుకొచ్చిందా.. అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మణి ప్రశ్నించారు. ఎస్‌ఆర్‌పురంలో ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీలో దళితులను పట్టించుకోలేదని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్థానికంగా టీడీపీ కోసం కష్టపడిన వారిని కాదని చెన్నైలో ఉన్న డాక్టర్ థామస్‌ను ఆ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమించారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయనకు ఇప్పుడు ప్రజా సేవ గుర్తుకొచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రజలే వారికి గుణపాఠం చెబుతారన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, నాయకులు జనార్దన్, దామునాయుడు, బాలకృష్ణయాదవ్, హరిరెడ్డి, బాబు, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


కార్యక్రమానికి హాజరైన అధికారులు

కార్వేటినగరం: మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రతి గడపకు మహిళా పోలీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా పోలీస్ ప్రతి గడపకు వెళ్లి మహిళలకు జరుగుతున్న అన్యాయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. అమ్మాయిలు సమాజిక మాధ్యమాల్లో కొత్త వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటి వల్ల మోసపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. చదువుకునే వారిని ప్రేమ పేరుతో వేధించడం నేరమని.. అలాంటి వాటికి పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. మహిళలను భర్త, బంధువులు శారీరకంగా, మానసికంగా హింసించినా, ఆత్మహత్యలకు పురికొల్పినా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, గృహ హింస, ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలు గ్రామాల్లో జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. ప్రతి మహిళా దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎస్‌ఐ దస్తగిరి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఈఓ ఎన్ఎస్ మణి పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరులతల్లి చిద్విలాసం


తిరుచ్చి వాహనంపై పద్మావతీదేవి

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు కూర్చిన ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీకష్ణముఖ మండపం వద్ద కొలువుదీర్చి కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం శ్రీవారి దేవేరి తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ప్రసాద్, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


ప్రేమ్‌రాజకుమార్‌ను అభినందిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

పాలసముద్రం: ఎంపీడీఓగా ప్రేమ్ రాజకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై పాలసముద్రం వచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయన్ను కలిసి సన్మానించారు. ప్రేమ్ రాజకుమార్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న మధుబాల

కార్వేటినగరం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని.. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లోని వివిధ పుస్తకాలు చదవడం వల్ల పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులతో పాటు విశ్రాంత ఉద్యోగులు, యువకులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వేసవి శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్ బాబు, విశ్రాంత హెచ్‌ఎం విజయకుమార్ పిళ్లై, వెంకటశిరీషా, రాఘువేంద్రరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం గుంటూరు విశాఖనగర్‌కు చెందిన యార్లగడ్డ మౌలేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.3,26,254, నెల్లూరుకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.50వేలు వేర్వేరుగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు దాతలకు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ సతీష్ మాలిక్, నాగభూషణం నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న 51 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నివాసులై ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉంటుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని వెల్లడించారు.

సత్ఫలితాలిచ్చిన సమ్మర్ క్యాంప్


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో చైర్మన్ మధుబాల

పుత్తూరు రూరల్: గ్రంథాలయాల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సత్ఫలితాలిచ్చాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.మధుబాల అన్నారు. శుక్రవారం పుత్తూరు గ్రంథాలయ సమ్మర్ క్యాంపులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలువురు విద్యార్థులు క్యాంపును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రతి గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించుకుని విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్యాంపులో కథలు చెప్పడం, పుస్తక పఠనం, డ్రాయింగ్, మెడిటేషన్, స్పోకన్ ఇంగ్లిష్ వంటి పలు అంశాలపై పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. గత నెల 8వ తేదీ ప్రారంభమైన సమ్మర్ క్యాంపు ఈనెల 11న ముగియనున్నదని చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.మీనాకుమారి, టీచర్ సుధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు


కళాకారులను సత్కరిస్తున్న ఉభయదారులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో వారం రోజులుగా మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్నచే హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటక ప్రదర్శన చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి కీచకవధ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. వెదురుకుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి కోలార్ ప్రకాష్, మీనాక్షి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. శుక్రవారం సాయంత్రం ఉత్తరగోగ్రహనం కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షిత ప్రసవం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పాలసముద్రం: ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పు సురక్షితమని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. శుక్రవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 37 మందికి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం సమయంలో 108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమీక్ష


హాజరైన బీఎల్‌ఓలు


మాట్లాడుతున్న కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ఫామ్ 6,7,8, 6బి ఫారమ్స్‌ను విధిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రిజిస్టర్ నిర్వహించకపోయినా ఇకపై తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం శానిటరీ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించి, పారిశుద్ధ్య పనులపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కలకు ట్రీ గార్డ్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

నేటి నుంచి సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో శనివారం నుంచి 13వ తేదీ వరకు సీఐటీయూ రాష్ట్ర సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు తెలిపారు. ఆయన శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. పెన్షన్ కోసం కార్మికుల జీతంలో చెల్లించే 10 శాతం మాత్రమే గ్యారంటీ చేశారన్నారు. 2.4 లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, 10.117 మందిని మాత్రమే పర్మనెంట్ చేయడం శోచనీయమన్నారు. టీటీడీలో 25 ఏళ్లకుపైగా పని చేస్తున్న అటవీ కార్మికులు రెగ్యులరైజేషన్‌కు నోచుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో జరుగనున్న సమావేశాల్లో సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

సంక్రాంతి సెలవుల పెంపుపై హర్షం

తిరుపతి ఎడ్యుకేషన్ : సంక్రాంతి సెలవులను ముక్కనుమ వరకు పెంచడంపై హిందూ ఉపాధ్యాయ సమితి (హెచ్‌యూఎస్) జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జనవరి తొమ్మిది నుంచి 18వ తేదీ వరకు కనుమ, ముక్కనుమను కలుపుకుని సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు అకడమిక్ క్యాలెండర్ రూపొందించడంపై హిందూ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పండుగలు జరుపుకోవడమంటే మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడమేనని, ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి ఈ నెల 2వ తేదీన హెచ్‌యూఎస్ తీసుకెళ్లిందని తెలిపారు. తమ విన్నపాన్ని పరిశీలించి సానుకూలంగా స్పందిస్తూ అకడమిక్ క్యాలెండర్లో జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించడం హర్షనీయమని వెల్లడించారు.